


## కథ

**పెబ్బిలి హైమావతి**

# ప్రేమించు ప్రేమకై

లంచ్ అవర్‌లో బాక్సు తీసుకుని డైనింగ్ హాల్ లోనికి వెళ్లాడు ఆనంద్. మూత తెరవగానే ఘుమ ఘుమ వాసనలతో పాటు పాలిథిన్ కవరులో వున్న గులాబి రంగు కాగితం మడత అతని దృష్టిని ఆకర్షించింది. ఏదో ప్రేమ సందేశం పంపిందే వసంత అనుకుంటూ ఓపెన్ చేశాడు.

"ప్రియ నేస్తమా!

ఆనందానికి అసలైన నిర్వచనం నువ్వే కదూ! ఉదయమే ఎందుకో మెలకువ వచ్చేసింది. ఎన్నడూ లేనంత ప్రశాంతత, తృప్తి నీ ముఖంలో గోచరించాయి. చాలా ముద్దొచ్చావు నాకు. సవ్వడి చేయకుండా బయటకు వచ్చేశాను.

తూరుపు దిక్కున వెలుగురేఖలు ఇంకా విచ్చుకోలేదు. పక్షుల కిలకిలారావాలతో భూపాలరాగం ఆలపిస్తూ జగతిని మేల్కొలుపుతున్నాయి. రాత్రి కురిసిన మంచు కరిగి ముత్యాల్లా ఆకుల మీద మెరుస్తున్నాయి. గడచిన రేయి ఆనందాన్ని మరోసారి గుర్తుచేసి తనువంతా పులకింతలు రేపింది. నీ చేతుల స్పర్శ నా చెంపల మీద ఇంకా తారాడుతున్నట్టే వుంది.

మన తొలిరేయిని మించిన హాయినిచ్చిన మధుర క్షణాలవి. ఏ హద్దులూ లేని ఆత్మార్పణలో ఇంత ఆనందం దాగి ఉందని ఇప్పటివరకూ నాకు తెలియనే లేదు. మనసులు కలసిన మధురకేళి నాలో ఇంకా ఇంకా విరహజ్వాలలు రగిలిస్తూనే వుంది. ఇచ్చిపుచ్చుకోవడంలో ఇంత ఆనందం ఉందని ఇప్పుడే తెలిసింది నాకు.

నేను గడచిన గతంలోని చీకటిని చూడడం లేదు. నేటి ఉషోదయంలోని అందాలని ఆస్వాదిస్తున్నాను.

మనసెరిగిన చెలికాడా... ఓ మధుర ప్రేమికుడా! ఎప్పటికీ ఇలాగే ఉంటానని బాస చేయవా? నీ అడుగులో అడుగేస్తూ ప్రపంచం అంచులదాకా పయనించాలని ఉంది. ఆనందానికి హద్దులెక్కడని వెదకాలని ఉంది.

ఇలాగే ఉండిపోరాదా నా గుండెలో...తడియారని పెదవుల మధురిమలందిస్తా... కౌగిళ్ల కైవారాలలో నీకు విడిది ఏర్పాటు చేసి అందాల విందు చేస్తా!

ఎప్పటికీ నీ ప్రియ సఖి

-వసంత"

ఉత్తరం చదివిన ఆనంద్ మనసు ఆనందంతో పరవళ్లు తొక్కింది. థాంక్యూ మై స్వీట్ హార్ట్, థాంక్యూ... అంటూ ఆ లేఖను ముద్దులాడాడు.

అదే క్షణంలో ఆనంద్‌కి ఒక్కసారిగా నిన్న జరిగిన సంఘటన కళ్ల ముందు మెదిలింది. అది గుర్తు రాగానే ఆనంద్ కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి.

ooo

"ఆనంద్! నువ్వు చాలా మారిపోయావు. ఇలా అయితే మనం కలిసి ఉండడం చాలా కష్టం" అంది వసంత బాధా, అవమానం కలగలిపిన స్వరంతో.

"సంతోషం! అలాగే కానీ... దరిద్రం వదిలిపోతుంది నాక్కూడా" అన్నాడు ఆనంద్ దూకుడుగా.

ఆ మాట వినడంతోనే అవాక్కయిపోయింది వసంత ఒక్క క్షణం.

"ఆనంద్, నువ్వేనా ఈ మాట అంటున్నది? నేను దరిద్రాన్నా?" అంది వసంత దెబ్బతిన్నట్లుగా చూస్తూ.

"కాక...బంగారానివా? నీ మూలంగా రోజు రోజుకూ ఇల్లు నరకమైపోతోంది. ఇంటికి రావాలంటేనే చికాకు పుడుతోంది" అన్నాడు ఆనంద్.

"దానికి నేనా బాధ్యురాల్ని? నీ ఇష్టానికి నువ్వు ఏ బాధ్యతలూ లేకుండా తిరిగి వస్తావు తప్ప...ఏనాడైనా ఇంటి సంగతి పట్టించుకున్నావా? పొరపాటున ఏదైనా పనిచేస్తే..ఏదో సోషల్ సర్వీస్ చేస్తున్నట్లు ఫీలవుతావే గానీ మన కోసం, మనింటికోసం చేస్తున్నానని, ఈ పనుల్లో సగం బాధ్యత నీకూ ఉందని ఏనాడైనా అనుకున్నావా? ఇంకా నీకేదో తక్కువైందని నన్ను బ్లేమ్ చేస్తూ ఉంటావు" అంది వసంత ఆవేశంగా.

"ఛీ..ఛీ! నీతో వాదన అనవసరం!" అంటూ వసంత అందించిన లంచ్‌బాక్స్ విసిరికొట్టి బూట్లు టకటకలాడించుకుంటూ బయటకు వెళ్లి బైక్ స్టార్ట్ చేసుకొని వెళ్లిపోయాడు ఆనంద్.

వసంతకి ఆవేశం స్థానంలో దుఃఖం చోటుచేసుకుంది. అతడు విసిరికొట్టిన లంచ్ బాక్స్ వంక పిచ్చిదానిలా చూసింది. బయట భోజనం చేయడానికి ఏమాత్రం ఇష్టపడని ఆనంద్ ఆ పూట అభోజనంగా ఉండిపోతాడని అనిపించగానే ప్రాణం ఉసూరుమంది.

ఎంతో ఇష్టపడి ప్రేమించి పెళ్లి చేసుకున్న తమ మధ్య ఈ అగాధం ఎలా వచ్చింది? అని ఆలోచిస్తూనే కన్నీరు వత్తుకుంటూ చిందిపడిన అన్నాన్ని ఎత్తి నేలంతా శుభ్రం చేసింది.

ఆనంద్‌తో జీవితం ఎంతో హాయిగా ఉంటుందని తల్లిదండ్రులను కాదని కోరి వచ్చి పెళ్లిచేసుకుంది. ఆ సంతోషం ఇలా మూన్నాళ్ల ముచ్చట అయిపోతుందని కలలో కూడా ఊహించలేదు వసంత. తనకి వచ్చిన ఈ కష్టం ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాలేదు. ఒకసారి అత్తగారితో మాట్లాడితే ఏదైనా పరిష్కారం చూపిస్తారేమో అనుకుంది. వెంటనే ఇంటికి తాళం పెట్టి అత్తగారింటికి బయలుదేరింది.

ooo

ఆనంద్ కోపంగా ఆఫీసుకైతే వచ్చాడు గానీ అతడికీ మనసు భారంగానే ఉంది. అనవసరంగా భార్య మనసు నొప్పించాను అని మథనపడ్డాడు.

కోపంతో వసంతని ఆఫీసు దగ్గర దింపకుండా వచ్చేశాడు. రెండు బస్సులు మారి టైముకు ఆఫీసుకు వెళ్లిందో లేదో? అని జాలిపడ్డాడు. ఒకసారి భార్యతో మాట్లాడితే బాగుండునని ఫోను తీశాడు. మళ్లీ ఏదో ఇగో అడ్డురాగా ఫోన్ పెట్టేశాడు. తాను ఆవేశంగా దరిద్రం వదిలిపోతుంది అన్న మాటకు హర్ట్ అయి వసంత ఏదైనా అఘాయిత్యానికి పాల్పడదు కదా అనుకున్నాడు. ఆ ఊహ రావడంతోనే ఒళ్లంతా ముచ్చెమటలు పోశాయి. వెంటనే వసంత సెల్‌కి రింగ్ చేశాడు. కానీ ఎంతకీ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కంగారుపడిపోయాడు.

ఆఫీసులో పర్మిషన్ తీసుకొని ఇంటికి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండడం చూసి ఆఫీసుకు వెళ్లి ఉంటుందని తిరిగి ఫోన్ చేశాడు. ఫోన్ రింగ్ ఇంట్లోంచి వినిపించడంతో కంగారు మొదలైంది ఆనంద్‌కు. వసంత ఆఫీసుకు ఫోన్ చేశాడు. వసంత లీవ్ అని చెప్పడంతో ఏం చేయాలో పాలుపోలేదు ఆనంద్‌కి. వసంత ఫ్రెండ్సందరికీ ఫోన్ చేశాడు. ఎవరికీ తెలియదని జవాబు రావడంతో కాళ్లూ చేతులూ ఆడలేదు ఆనంద్‌కు. ఏం చేయాలో తోచక తండ్రి దగ్గరకు వెళ్లాడు.

ఆనంద్ వెళ్లేసరికి జగన్నాథం చాలా బిజీగా ఉన్నాడు ఆఫీసులో. కొడుకును చూసి ఆశ్చర్యపో

యాడు. "ఏంట్రా ఇలా వచ్చావు?" అనడిగాడు.

"ఏం లేదు నాన్నా...ఎందుకో మీతో ఒకసారి మాట్లాడాలనిపించింది" అన్నాడు.

"ఎనీథింగ్ సీరియస్?"

"ఏం లేదు నాన్నా..ఇంట్లో ఏవే చికాకులు. మా ఇద్దరికీ ఏ విషయంలోనూ పొంతన కుదరడం లేదు. ఇలా ఉంటే కొద్దిరోజుల్లో మేమిద్దరం విడాకులు తీసుకోవలసి వస్తుందేమోనని భయంగా ఉంది. ఉదయం మాటా మాటా అనుకున్నాము. నేను కోపం వచ్చి వెళ్లిపోయాను లంచ్ బాక్సు కూడా తీసుకువెళ్లకుండా. దాంతో తను ఇంటికి తాళం పెట్టి అలిగి ఎక్కడికో వెళ్లిపోయింది. ఇదేమైనా బాగుందా చెప్పండి?"


"అమ్మాయి కనబడకపోతే ఆందోళన పడవలసిందిపోయి ..ఇప్పుడు తప్పులు ఎంచుతున్నావేమిరా? పెళ్లయి ఇద్దరు పిల్లలు పుట్టాక ఇలాంటి ఆలోచనలు ఎలా వస్తున్నాయిరా నీకు? అసలే నీకోసం తల్లిదండ్రులను కూడా ఎదిరించి వచ్చింది ఆ పిల్ల. ముందు తను ఎక్కడికి వెళ్లిందో చూడు!"

"అందుకే కదా ఇక్కడికి వచ్చింది. నాకు మాత్రం గాభరా లేదనుకున్నారా? అయినా తనతో నాకు బొత్తిగా సరిపడడం లేదు. నేను ఇంటి బాధ్యతలేమీ పట్టించుకోవడం లేదు అంటోంది. రోజూ తనని ఆఫీసులో నేనే దింపుతున్నాను. వీలైతే సాయంత్రం నేనే ఇంటికి తీసుకువస్తాను. అదేం పట్టించుకోకుండా నాకు బాధ్యత లేదని ఆరోపణ చేస్తోంది" అన్నాడు ఆనంద్ ఉక్రోషంగా.

"బాగుందిరా, కోడల్ని ఆఫీసుకు తీసుకెళ్లి తీసుకురావడం ఏదో మహోపకారం చేస్తున్నట్లు మాట్లాడుతున్నావే. నీ ఆఫీసుకు వెళ్లే దారి అదే కనుక ఆఫీసు దగ్గర దింపుతున్నావు. పైగా వీలైతేనే సాయంత్రాలు ఇంటికి తీసుకువస్తానంటున్నావు. నాకు తెలియక అడుగుతాను సాయంత్రాలు నువ్వు ఇంటికి రాకుండా వెలగబెట్టే రాచకార్యాలు ఏమిటో?"

"ఏదో ఫ్రెండ్స్‌తో కాసేపు రిక్రియేషన్ కోసం కార్డ్స్ కానీ కేరమ్ కానీ ఆడుతూ ఉంటాను"

"ఓహో, రిలాక్స్ కోసం కాసేపు ఆడుకుంటావా? మరి నీకేగానీ, నీ భార్యకు రిలాక్సేషన్ అవసరం లేదా? ఉదయం ఇంట్లో పని చేసి తరువాత ఆఫీసులో డ్యూటీ చేసి అక్కడి నుండి బస్సుల్లో వేలాడి ఇంటికొచ్చి వంటపని, పిల్లల పనీ చూసే తనింకెంత




అలిసిపోతుందో ఆలోచించావా ఎప్పుడైనా?"

"అయితే ఏమిటి నాన్నా..ఇంటి పనీ, వంటపనీ చేయాలా నేను?" అన్నాడు ఆనంద్ రోషంగా.

"మన పని మనం చేసుకోవడంలో తప్పేముందిరా? పోనీ ఆ పనులన్నీ వదిలేసి పిల్లల చదువుల సంగతయినా చూడవచ్చు కదా..మీ అమ్మ ఏ ఉద్యోగమూ చేయకపోయినా, మీ చదువుల సంగతి నేనే చూసేవాడిని. ఆ పైన ఇంటిపనిలో ఓ చేయి వేసేవాడిని"

"మీ కాలం వేరు, మా కాలం వేరు! మీలా మాకెలా కుదురుతుంది?"



"కాలాలు వేరైనా పని అదే కదా..నిజం చెప్పాలంటే ఆడవాళ్లకు పని భారం పెరిగింది ఇప్పుడే! ఎందుకంటే భార్యాభర్తలిద్దరూ పనిచేస్తేనే గాని గడవని రోజులు వచ్చాయి. అందుకే తప్పనిసరిగా ఇద్దరూ పని షేర్ చేసుకోవాలి. నీవు కూడా ఓ చెయ్యి వేస్తే తనకి కాస్త ఊరటగా ఉంటుంది. మీ ఇద్దరి మధ్యా చెలరేగే కీచులాటలకు తెరపడుతుంది" అన్నాడు జగన్నాథం మృదువుగా.

"అది కాదు నాన్నా..నాకు అన్నిటికంటే బాధ కలిగించే విషయం పడక దగ్గరే. వసంత నాకేమాత్రం సహకరించడం లేదు. మొక్కుబడి వ్యవహారంలా ఉంటుంది. అది సాల్వ్ అయిపోతే ఇక చిరాకు అన్న ప్రశ్న ఉండదు" అన్నాడు ఆనంద్ చెప్పలేక చెప్తున్నట్లుగా గొంతు తగ్గించి.

అది విని ఫక్కున నవ్వాడు జగన్నాథం.

"ఒరే వెర్రినాగన్నా..పడక దగ్గర బాగుంటే అంతా సరి అయిపోతుంది అంటున్నావు. కానీ ఆ పడక దగ్గరకు చేరే మనిషి...మానసికంగా, శారీరకంగా సంసిద్ధం కావాలి కదా! నువ్వా దిశగా ఎప్పుడైనా ఆలోచించవా? వసంతని పెళ్లి చేసుకుందామని నీ అంతట నువ్వే నిర్ణయం తీసుకున్నావు. పెద్దల అంగీకారం లేకుండా పెళ్లి చేసుకుంటే చాలా కోల్పోవలసి వస్తుందని వాళ్ల తల్లిదండ్రులు, మేము చెప్పినా వినిపించుకోలేదు ఆనాడు. పాపం ఆ పిల్ల నిన్ను నమ్మి అందర్నీ వదులుకొని వచ్చింది. అదంతా పక్కన పెట్టి మీ ఇద్దరికీ ఇప్పుడు సరిపడలేదంటూ విడాకుల మాట ఎత్తావు. ఇదేమైనా న్యాయంగా ఉందిరా?"

"అయితే నాన్నా తప్పంతా నాదేనంటారా?"

"నీదే అని కచ్చితంగా చెప్పలేను..ఎందుకంటే నేను ప్రత్యక్షంగా ఏదీ చూడలేదు కనుక. కానీ ఎక్కువ భాగం మాత్రం నీ తప్పే అనిపిస్తోంది నాకు. నిన్ను నీవు తరిచిచూసుకొని బేరీజువేసుకో. లోటుపాట్లేమిటో నీకే తెలుస్తాయి. జీవితం చాలా అందమైనది. దాన్ని అందంగా మలచుకొని ఆనందించాలే కానీ అర్థం లేని అపోహలతో కీచులాటలతో జీవితాన్ని వృథా చేసుకోకూడదు. నీ సరదాలు తీర్చలేదని వాపోయావు కానీ ఆమె కోరికలేమిటో తెలుసుకొనే ప్రయత్నం చేశావా? ఒక్కసారి ఆమె మనసులోకి తొంగి చూడు. సమస్యలన్నీ మంచులా వాటంతటవే విడిపోతాయి" అన్నాడు జగన్నాథం.

0.0.0

హఠాత్తుగా వచ్చిన కోడల్ని చూసి ఆశ్చర్యపోయింది ఆవిడ.

"అత్తయ్యా!" అంటూ ఆమెని చుట్టేసి బావురుమంది వసంత.

"ఏమిటమ్మా..ఏమైంది?" అంటూ వసంతని పొదివి పట్టుకొని లోపలికి తీసుకెళ్లింది తాగేందుకు మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది.

"అత్తయ్యా, ఏం చెప్పమంటారు? ఆనంద్‌కీ, నాకూ క్షణం పడడం లేదు. ప్రతిదానికీ కోపం, చిరాకు. ఏం మాట్లాడినా తగువులే! ఎక్కడి వస్తువులక్కడ పడేస్తూ ఉంటాడు. ఇల్లు నీట్‌గా ఉంచలేదని సతాయిస్తాడు. పోనీ కదా అని సర్దితే..తన వస్తువేదో కనపడలేదని..నా వస్తువులు నీవెందుకు ముట్టుకున్నావని చిందులేస్తాడు. స్వతంత్రించి ఏదైనా పనిచేస్తే నన్నడగకుండా ఎందుకు చేశావంటాడు. చేయకుండా వదిలేస్తే..ఏమీ చదువుకోలేనిదానిలా బిహేవ్ చేయకు. ఈమాత్రం పనిచేయలేవా? అంటాడు. ఆనంద్ ధోరణేమిటో నాకసలు అర్థం కావడం లేదు. అమ్మావాళ్లని ఎదిరించి చేసుకున్నానీ పెళ్లి. ఇదంతా వాళ్లకి తెలిస్తే ఇంకేమైనా ఉందా? అందుకే మీ దగ్గరకు వచ్చాను. ఏదైనా మార్గం చూపిస్తారని!" అంది వసంత కన్నీళ్లతో.

అంతా విని సావిత్రమ్మ కోడలి వీపు నిమురుతూ "బాధపడకమ్మా, ఇలాంటి చిరాకులు, పరాకులు ప్రతీ ఇంట్లోనూ ఉంటాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్నంత మాత్రాన ఇలాంటివి ఉండవనుకుంటే పొరపాటే! ఇంతకాలం ఇలాంటి సెగలేవీ మీకు సోకలేదని సంతోషించాను. అయితే ఇంట్లో వున్నది మీరిద్దరే కాదు పిల్లలు కూడా ఉన్నారని, మీ ఘర్షణల ప్రభావం వాళ్ల మీద కూడా పడుతుందని గమనించాలి మీరు" అంది ఆలోచనగా.

"అంత ఆలోచించే తీరికెక్కడిది అత్తయ్యా! ఉదయం లేచిన దగ్గర నుండీ రాత్రి పడుకునే వరకూ యంత్రంలా పని చేస్తాను. ఆ పైన ఆనంద్ ఎప్పుడేమంటాడోననే బెదురుతో ఉంటాను. ఇక పిల్లలు వింటారని ఏం ఆలోచిస్తాను? ఏదైనా వస్తే మాటా మాటా పెరిగి నువ్వెంత అంటే నువ్వెంత? అని అరిచేసుకుంటాము. పాపం పిల్లలు బిక్క చచ్చిపోయి ఇదంతా చూస్తూ ఉంటారు" అంది వసంత దిగులుగా.

"అయితే మావాడు నీకేం పని సాయం చేయడా?"

"సాయమా..నేను చేసే పనికి వంకలు పెట్టకుండా ఉంటే చాలు"

"పోనీ సాయం చేయమని



## ఇషా పెళ్లి!

బాలీవుడ్‌లో పెళ్లిళ్ల సీజన్ మొదలైనట్టుంది. శిల్పాశెట్టి తన ప్రియుడు రాజ్‌కుంద్రాని పెళ్లిచేసుకుంటుంటే- మరో బాలీవుడ్ భామ ఇషా కొప్పీకర్ కూడా పెళ్లికూతురవుతోంది. హోటల్ బిజినెస్ చేస్తున్న టిమ్మీ నారంగ్ అనే బిజినెస్ వాలాతో కొంత కాలంగా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ నలుగురి దృష్టినీ ఆకర్షిస్తున్న ఇషా నవంబర్ 29న పెళ్లాడబోతోందిట. పెళ్లిసరికి తన సినిమాల షూటింగ్‌లని వీలైనంత వరకూ పూర్తి చేసేస్తోందిట. పెళ్లి తర్వాత మరి సినిమాల్లో నటిస్తుందో లేదో ఇంకా ఖరారు కాలేదు.

వాడిని నువ్వెప్పుడైనా అడిగావా?"

"ప్రత్యేకంగా అడగాలా అత్తయ్యా? పనితో నేనెంతో సతమతమయిపోతున్నా చూసి కూడా పట్టించుకోడే! తనతో సరదాగా కబుర్లు చెప్పలేదని ఒకటే విసుగు. పనివేళ నాకెలా కుదురుతుంది? తీరి కూర్చుని అది వండు, ఇది వండు అంటాడు. చెప్పింది చేయకపోతే అరిచేస్తాడే కానీ కొంచెం కూడా సాయం చేయడు. ఇంత కష్టపడే నాకు కాస్త ఓదార్పును ఇవ్వవలసిందిపోయి తనకేదో తక్కువయిందని తన సరదాలు తీర్చడం లేదని సాధిస్తాడు. శృంగారంలో తనకి సహకరించడం లేదని జడపదార్థంలా ఉన్నాని కించపరిచి మాట్లాడతాడు. దాంతో ఉన్న మూడ్ పోతుంది నాకు. రాత్రి కూడా అలాంటి మాటలతో గాయపరిచాడు. ఉదయం అకారణంగా నా మీద విరుచుకుపడ్డాడు. మీరే చెప్పండి అత్తయ్యా..నేను ఆనంద్‌కి అనుకూలంగా నడుచుకోవడం లేదా? నా మూలంగా ఈ రోజు ఆనంద్ అభోజనంగా ఉంటాడు అంటేనే ఎంతో బాధగా ఉంది" అంది వసంత రుద్ధ కంఠంతో.

వసంత చెప్పింది వినగానే సమస్యకు మూలం ఏమిటో అర్థమయింది సావిత్రమ్మకు.

"చూశావా ఇంత కోపమూ, బాధలోనూ కూడా నువ్వు వాడి గూర్చే ఆలోచిస్తున్నావు! అదే భార్యాభర్తల మధ్య ఉండే బంధంలోని గొప్పదనం..కానీ వసంతా మీరిద్దరూ మరీ చైల్డిష్‌గా ఆలోచిస్తున్నారు కనుకే ఈ చికాకులన్నీను. ముందు మీరిద్దరి మధ్యా ఉన్న కమ్యూనికేషన్ గేప్‌ను తగ్గించుకునే ప్రయత్నం చేయండి. ఏదైనా మన మనసులో ఏముందో చెబితేనే గదా ఎదుటివాళ్లకి తెలిసేది.

ఆనంద్‌ది ఉత్త పసిపిల్లాడి మనస్తత్వం. తాను కోరుకున్నది అందకపోతే భరించలేడు. మెల్లగా, లాలనగా నీ మనసు విప్పి చెప్పు. కష్టసుఖాలన్నీ కలిసి షేర్ చేసుకుంటే ఏ సమస్యలూ ఉండవు. ఇద్దరికీ ఒకరి మీద ఒకరికి అంతులేని ప్రేమ ఉన్నా ఇగో ప్రోబ్లమ్ వలన అదంతా మరుగున పడిపోతుంది. మనసు విప్పి మాట్లాడుకుంటే అంతా పరిష్కారమయిపోతుంది. అసలు పెళ్లయ్యాక మీ ఇద్దర్నీ మా దగ్గరే కొంత కాలం అట్టే పెట్టుకుందామనుకున్నాను. వాళ్ల స్వేచ్ఛకు మనమెందుకు అడ్డుకావాలి అంటూ మీ మావయ్య గారు పడనివ్వలేదు. దాని ఫలితమే ఇదంతా. అదే కొంతకాలం మీరు మాతో కలిసి ఉంటే జీవితం అంటే మంచి అవగాహన కలిగేది మీకు. సరే ఫోం చేద్దాంలే!" అంది కోడలి చెయ్యి పట్టి లేవదీస్తూ.



"వద్దత్తయ్యా..పాపం తనేమీ తినకుండా ఉంటాడు!" అంది వసంత.

"సరే అయితే వాడికి ఫోన్ చేసి చెప్పు ఇక్కడి రమ్మని..నేనీలోగా కుక్కర్ పెట్టేస్తాను"

అత్తగారు అలా చెప్పడంతో వసంత కళ్లు మెరిశాయి. అప్పుడు గమనించింది తాను ఇంటి దగ్గర సెల్ మరిచిపోయి వచ్చిన సంగతి.

ఫోన్ చేయకుండా ఆలోచనలో పడిన కోడలి వంక చూసి "ఏం ఆగావు? ఫోన్ చెయ్యమ్మా!" అంది.

"ఫోన్ ఇంట్లో ఉండిపోయింది"

"దీనికింత ఆలోచనెందుకు? ఆ గదిలో కార్డ్‌లెస్ ఉంది తీసి చెయ్యి"

"హలో ఆనంద్! నేను వసంతని మాట్లాడుతున్నాను" అంది వసంత.

భార్య గొంతు వినడంతోనే ప్రాణం లేచి వచ్చినట్లయింది ఆనంద్‌కు. "వసూ, ఎక్కడున్నావు?" అనడిగాడు ఆదుర్దాగా.

అతడి గొంతులో దాచినా దాగని ఆనందం, అనురాగం వసంతని కట్టిపడేసింది.

"సారీ ఆనంద్, నేను నిన్ను చాలా విసిగించాను"

"లేదులే వసూ, నేనే నిన్ను బాగా హర్ట్ చేశాను ఇవ్వాళ. సరే, ఇంతకీ ఎక్కడున్నావు? మీ ఆఫీసుకు ఫోన్ చేస్తే లీవ్ అని చెప్పారు..ఇంటి దగ్గరా లేవు"

ఆ మాట వింటూనే చాలా కదిలిపోయింది వసంత. పాపం నాకోసం ఆనంద్ ఎంత ఆదుర్దా పడ్డాడో అనుకుంది. "నువ్వు నీ సెల్‌లో డిస్ ప్లే అయిన నెంబరు చూడలేదా? నేను మీ ఇంటి నుండే మాట్లాడుతున్నాను. నిన్ను అత్తయ్యగారు భోజనానికి ఇక్కడికే వచ్చెయ్యమన్నారు!" అంది వసంత.

"అవునా? నేను చూడలేదు. సరే వస్తాలే!" అంటూ ఫోన్ కట్ చేసి "నాన్నా వసంత ఫోన్ చేసింది. తను మనింటిదగ్గరే ఉంది" అన్నాడు మెరిసే కళ్లతో.

కొడుకు ఫోన్‌లో మాట్లాడుతుండగానే అర్థమైంది ఆయనకు. అందుకే చిన్నగా నవ్వుతూ "ఇంకేం? ఇంటికి వెళ్దాం పద!" అన్నాడు జగన్నాథం.

ఏం జరగనట్లే నలుగురూ కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు. భోజనాలు అయ్యాక ఇంటికి వెళ్దామంటూ బయలుదేరిన వసంతకీ, ఆనంద్‌కీ విడివిడిగా జాగ్రత్తలు చెప్పారు జగన్నాథం దంపతులు.

"అమ్మా వసంతా! మీ సమస్యకు

## ఐశ్వర్య కోపం

అందాల భామ ఐశ్వర్యారాయ్‌కి కూడా కోపం వస్తే ఎలా వుంటుంది అనుకుంటున్నారా? ఇలా వుంటుంది... ఎలాగంటే- 'యాక్షన్ రీప్లే' అనే సినిమాలో నటిస్తున్న ఐశ్వర్య ఆ సినిమా రషెస్ చూసాక బోల్డు నిరుత్సాహపడిందిట తన పాత్ర తీరు చూసి. ఆ సినిమా షూటింగ్ పూర్తయిపోయినా దర్శకుడి మీద వచ్చిన కోపంతో- నేను డబ్బింగ్ చెప్పనుగాక చెప్పనని భీష్మించుకు కూర్చుందిట. దాంతో డైరెక్టరుగారు తలపట్టుక్కూర్చున్నాట్ట. ఐష్ గార్ని ఎలా ఐస్ చేసి డబ్బింగ్ చెప్పించుకోవాలా అని తెగ ఆలోచిస్తున్నాట్ట. ఏం జరుగుతుందో మరి!

మూలం మీ ఇద్దరికీ తగినంత ఏకాంతం లేకపోవడమే! శని, ఆదివారాలు పిల్లల స్కూల్‌కి శెలవే గదా! వాళ్లని శనివారం ఇక్కడ దించి, ఆదివారం సాయంత్రం తీసుకువెళ్లండి. పిల్లలతో మాకూ సరదాగా ఉంటుంది. మీక్కూడా ప్రైవసీ దొరికి సంతోషంగా గడపగలుగుతారు" అంది సావిత్రమ్మ.

"ఆనంద్, ఇలా చెప్తున్నానని ఏమీ అనుకోకు. ఎందుకంటే మీరేమీ తెలియని చిన్న పిల్లలు కారు. దాంపత్యం గురించి ముత్యాల ముగ్గు సినిమాలో ముళ్ళపూడిగారు చక్కని నిర్వచనం చెప్పారు. భార్యాభర్తల అనుబంధానికి సంకేతం తాంబూలం అట. భార్యాభర్తలు ఆకూ వక్కలయితే సున్నం అనురాగమట. ఆ మూడు కలిపి నమిలితే నోరు ఎర్రగా పండుతుంది. ఇది వక్కా, ఇది ఆకు, ఇది సున్నం అని విడదీసి చెప్పలేము. చూపించలేము. కానీ పండిన నోరు అనుకూల దాంపత్యానికి సాక్షిగా మిగిలిపోతుందట. మీరు అలా కలిసిపోతే ఎవరు ఎక్కువా, ఎవరు తక్కువా అనే సమస్య ఉత్పన్నం కాదు. బెస్ట్ ఆఫ్ లక్! అమ్మ చెప్పినట్లు ఇక నుండీ పిల్లల్ని వారం వారం ఇక్కడ విడిచి వెళ్లండి!" అన్నాడు జగన్నాథం.

మౌనంగా ఇల్లు చేరారు ఇద్దరూ.

తాళం తీసి ఇంట్లోకి అడుగుపెట్టిన వసంతను వెనుకనుండి రెండు చేతులతో చుట్టేశాడు ఆనంద్. "ఐయామ్ సారీ వసూ నిన్ను చాలా బాధపెట్టాను. నేను చేస్తున్నది తప్పని దాని వలనే మన మధ్య అపార్థాలు చోటుచేసుకున్నాయని నేను గమనించలేదు ఇంత వరకూ!" అన్నాడు భార్యని మరింత గాఢంగా హత్తుకుంటూ.

"కాదులే ఆనంద్, తప్పునాదీ ఉంది..నా మనసులో మాటని సరిగ్గా నీకు కమ్యూనికేట్ చేయలేకపోయాను. సమస్యకు మూలం ఎక్కడుందో తెలుసుకోకుండా అకారణంగా గొడవపడ్డాము" అంది వసంత అతని నుంచి విడిపించుకుంటూ.

"దూరంగా జరగక వసూ..ఒక్క క్షణం కూడా నీ ఎడబాటు నేను భరించలేను!"

"ఆనంద్, నువ్వెప్పుడూ ఇలాగే ఉండిపోరాదా నాతో? నువ్వు నా పక్కనుంటే ఏ సిరులూ, సౌఖ్యాలూ అక్కర్లేదు నాకు" అంది వసంత తన్మయంగా.

అరుదుగా దొరికిన ఆ ఏకాంతం వారిద్దరినీ స్వర్గపుటంచులు చవిచూసేలా చేసింది.

పిల్లలిద్దరూ స్కూల్ నుంచి వచ్చేసరికి పనంతా ముగించి, షికారుకు వెళ్లేందుకు తయారైంది వసంత.

ఆనంద్ పనిలో సాయం చేయడంతో కబుర్లు చెప్పుకుంటూ పనిచేయడం వలన ఇద్దరికీ ఏమాత్రం అలసట తెలియలేదు సరికదా, ఎంతో ఉల్లాసంగా అనిపించింది.

స్కూలు నుండి వచ్చిన పిల్లలు షికారు అనగానే ఎగిరి గంతులు వేశారు. చకచకా హోంవర్కు పూర్తి చేసి స్నానాలు చేసి వచ్చి తల్లి పెట్టిన టిఫిన్ తిని హుషారుగా తయారయిపోయారు. ఆరోజు ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. భార్యాభర్తలిద్దరూ మనసు విప్పి మాట్లాడుకున్నారు.



"నాకు నీతో సరదాగా గడపాలని ఉంటుంది వసూ..నువ్వెప్పుడు చూసినా పనీ, పనీ అంటావు. ఆ పైన పిల్లలున్నారంటావు. మనకి ఏకాంతం దొరకడం గగనమై పోతుంది. ఆ విసుగు అనేక రూపాల్లో బయటపడుతోంది. ఒక్కోసారి నేను ఓవర్‌గా రియాక్టయి నిన్ను బాగా హర్ట్ చేస్తున్నాను...సారీ!" అన్నాడు ఆనంద్ భార్య ముంగురులు సవరిస్తూ.

"సారీ ఎందుకు ఆనంద్? నాకు మాత్రం నీతో గడపాలని ఉండదా? సాయంత్రంలా నువ్వు నా పనిలో షేర్ చేసుకుంటే..నాకూ కొంత సమయం మిగులుతుంది, నీతో గడిపేందుకు. పైగా కబుర్లు చెప్పుకుంటూ పని చేసుకుంటే అదే పెద్ద ఎంజాయ్‌మెంట్, తెలుసా?" అంది వసంత.

తండ్రి కూడా ఆ మాటే చెప్పడం గుర్తుకు వచ్చింది ఆనంద్‌కి. "అవును, నేను గ్రహించాను. ఇక ముందు నీకిలా ఇబ్బంది కలిగించనులే! ఇవ్వాల్టి నుండి కొత్తజీవితానికి శ్రీకారం చుడదాం!" అన్నాడు.

"ఓ.కె. థాంక్యూ!" అంది వసంత.

"దీంతోపాటు నాకు మరో బ్రహ్మాండమైన ఐడియా వచ్చిందోయ్! ఈరోజు నుండి మనం ఒక కొత్త ఆట మొదలుపెడదాం!" అన్నాడు ఆనంద్ నవ్వుతూ.

"మరి ఇప్పుడు చేస్తున్నదేమిటి?"

"ఇది అది కాదు లేవోయ్! నిజంగా ఆటే..గమ్మత్తయిన ఆట. నేనామధ్య ఏదో పుస్తకంలో చదివాను. అలా చేస్తే ఎలా ఉంటుందా అని అనిపించిదప్పుడే. పేరేమిటో తెలుసా? లవ్‌గేమ్! మనిద్దరం బ్యాంకు ఎకవుంట్‌లా ఒక లవ్ ఎకవుంట్ ఓపెన్ చేద్దాం. ఇద్దరి ఎకవుంట్‌లు వేరు వేరుగా ఉంటాయి. అందులో ఎవరు రెండో వాళ్లకు నచ్చిన పని చేసినా టెన్ పాయింట్స్ వేసుకుందాం. ప్రతిరోజూ నైట్ ఆ పాయింట్స్ కౌంట్ చేద్దాం. ఎవరికి ఎక్కువ పాయింట్స్ వస్తే వాళ్లు గెలిచినట్లు. ఓడినవాళ్లు గెలిచినవాళ్లకి ఎకవుంట్‌లో ఎన్ని ఎక్కువ పాయింట్లు ఉంటే అన్ని ముద్దులు ఇవ్వాలి" అన్నాడు ఆనంద్.

"బాగానే ఉందిగానీ, దీనివలన పెద్ద థ్రిల్ ఏముంది? ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ఆనందం ఇద్దరికీ సమానమే కదా!" అంది వసంత నవ్వేస్తూ.

"అక్కడే వుంది థ్రిల్ అంతా..గెలిచిన వాళ్లు కోరిన రీతిలో కోరిన చోట ఓడినవాళ్లు ముద్దుపెట్టాలమ్మా!"

"ఛీ..పో! నీవన్నీ తుంటరిపనులే..ఇలాంటి ఆటలేం నేను ఆడను బాబూ!" అంది వసంత ముఖమంతా సిగ్గుతో ఎర్రగా కందిపోగా.

"ప్లీజ్ వసూ! ఈ ఒక్కసారికీ నా మాట వినవా?" అంటూ గోముగా అడిగాడు ఆనంద్.

కరిగిపోయింది వసంత. ఆ రాత్రి మరో తొలిరాత్రి అయింది వారికి.

## బాబోయ్ అమృత!

ఎలాగోలా వార్తల్లో వుండాలని కాబోలు ఎంతో అమాయకంగా కనిపించే అమృతారావు కూడా కాస్త హాట్ హాట్ గెటప్పులలో కనిపిస్తోంది. అక్కడితో అయిపోలేదు-తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'పెళ్లికి ముందు సెక్స్‌లో తప్పు లేదు' అంటూ ఆ వాదనకి తన మద్దతుని తెలిపింది. ఇలాగే ఆమధ్య తమిళ తార కుష్బూ కూడా ఇలాగే వ్యాఖ్యానించి ఎన్నో విమర్శలకు గురైంది. అమృతా రావుకి మాత్రం ఇంకా అలాంటివి ఎదురు కాలేదు. కానీ ఆమె కామెంట్ విన్న వాళ్లంతా పబ్లిసిటీ కోసం మరీ ఇలా మాట్లాడడం ఏం బావుంది? అని ముక్కున వేలేసుకుంటున్నారు.